క్లుప్తంగా

సబ్‌స్టేషన్లు మంజూరు చేయండి


వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర: నియోజకవర్గంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రతిపాదనలో ఉన్న కొత్త సబ్‌స్టేషన్లను మంజూరు చేయాలని శుక్రవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి విద్యుత్‌శాఖ సీఎండీ రఘుమారెడ్డి, డైరక్టర్ ఆపరేషన్ శ్రీనివాస్‌రెడ్డిలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. దేవరకద్ర మండలంలోని కోయిల్‌సాగర్, నార్లోనికుంట్ల, మదనాపురం మండలంలోని అజ్జకొల్లు గ్రామాలలో 33/11 కేవీ సబ్‌స్టేషన్లను మంజూరు చేయాలని కోరారు. ఒక్కో సబ్‌స్టేషన్‌కు రూ.15కోట్ల ప్రకారం రూ.45కోట్లు, అలాగే విద్యుత్ సమస్యల కింద మరో రూ.10కోట్లు విడుదల చేయాలని విన్నవించారు. 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లు, జానంపేట, అన్నాసాగర్‌లకు డబుల్ ఫీడర్, అవసరం ఉన్న చోట కొత్త లైన్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. కొత్త పోల్స్, డామేజీ అయిన వాటి స్థానంలో కొత్తవి, 11 కేవీ లైన్స్, ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేయాలని, భూత్పూర్, దేవరకద్రలకు అదనంగా ట్రాన్స్‌ఫార్మర్‌లు మంజూర్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ సరఫరా చేయాలని వినతి

మిడ్జిల్: మండలంలో పంటలు సాగు చేసిన రైతులకు 24గంటల విద్యుత్ సరఫరా చేయాలని కోరుతూ శుక్రవారం బీజేపీ, రైతుల ఆధ్వర్యంలో విద్యుత్ ఏఈ జ్ఞానసుందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తిరుపతి మాట్లాడుతూ రైతులకు 24గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని ప్రకటనలు ఇస్తున్నారే తప్పా 10గంటలకు మించి సరఫరా కావడం లేదని తెలిపారు. కార్యక్రమంలో రైతులు జంగిలయ్య, లాలు, రామాంజనేయులు, వెంకటయ్య, ఆంజనేయులు, చెన్నయ్య, తిరుపతయ్య, యాదయ్య పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ పంపిణీ



దేవరకద్ర: కౌకుంట్ల మండల కేంద్రంలో శుక్రవారం నాయకుడు కిషన్‌రావు జన్మదినం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ స్వప్న ఆధ్వర్యంలో కిషన్‌రావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన దివ్యాంగుడు గొల్ల జమ్మన్నకు ట్రై సైకిల్ పంపిణీ చేశారు. అలాగే విద్యార్థులకు పలకలు, వాటర్ బాటిల్స్ అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నీలి నరసింహులు పాల్గొన్నారు.

భగవద్గీత గ్రంథాల పంపిణీ

కోయిల్‌కొండ: భగవద్గీత ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని ఎంపీడీఓ జయరాములు అన్నారు. శుక్రవారం మండలంలోని అనంతపూర్‌లో ఆంజనేయస్వామి ఆలయంలో పలువురికి త్రైత సిద్ధాంత భగవద్గీత ఆధ్యాత్మిక గ్రంథాలు అందించారు.

కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు

దేవరకద్ర: తుంగభద్ర, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను దేవరకద్రలో నిలపడం శుభపరిణామని బీజేపీ మండల అధ్యక్షుడు అంజన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేవరకద్ర రైల్వే జంక్షన్‌ను గుర్తించి మరింత అభివృద్ధిలోకి తీసుకురావాలని కోరారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, దొకూర్ పవన్‌కుమార్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్రశేఖర్, నాయకులు జితేందర్‌రెడ్డి, రవి, గోవిందు, చెన్నప్ప, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించండి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించకపోతే సమ్మె చేపడుతామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి, గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్‌గౌడ్ హెచ్చరించారు. శుక్రవారం జిల్లాలోని వివిధ గ్రామాల్లో సర్వే నిర్వహించడం జరిగిందని, గ్రామ పంచాయతీ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. జీఓ 60ప్రకారం పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు, పీఎఫ్, ఈఎస్‌ఐ, గ్రాట్యూటీ, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని అన్నారు. జీఓ 51ను సవరించి మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

జడ్చర్ల టౌన్: బాదేపల్లి జెడ్పీ హైస్కూల్‌లోని 200మంది పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకుడు ధృవకుమార్ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. హెచ్‌ఎం బాసిత్, క్లాస్‌మేట్ క్లబ్ అధ్యక్షుడు సంజీవ్‌గుప్త పాల్గొన్నారు.

అంధత్వ నివారణకు కృషి

అడ్డాకుల: కంటి సమస్యలతో బాధపడుతున్న వారు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు జి.ఇంద్రయ్యసాగర్ సూచించారు. మూసాపేట మండలంలోని స్ఫూర్తి తండాలో శుక్రవారం ఆయన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. 18ఏళ్ల పైబడిన వారందరూ కంటి వెలుగులో పరీక్షలు చేయించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జానంపేట మెడికల్ ఆఫీసర్ షబానాబేగం, మండలాధ్యక్షుడు లక్ష్మీనర్సింహ యాదవ్, సర్పంచ్‌లు లలిత, చంద్రశేఖర్, నాయకులు బాలయ్య తదితరులు ఉన్నారు.

పెద్దతండాలో శిబిరం ప్రారంభం..

మహమ్మదాబాద్: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని చౌదర్‌పల్లి పెద్దతండాలో కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి సమస్యలతో ఎంతో మంది బాధపడుతున్నారని, అలాంటి వారికి ఎలాంటి ఖర్చు లేకుండా అనుభవజ్ఞులైన వైద్యులచే చికిత్సలు ప్రభుత్వం చేయిస్తున్నదని తెలిపారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీదేవి, ఎంపీటీసీ సోనీబాయి, నాయకులు భీమయ్య, దేవి జానాయక్ పాల్గొన్నారు.

మిడ్జిల్: కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని బోయిన్‌పల్లి, మున్ననూర్ గ్రామాల్లో కంటి పరీక్ష కేంద్రాలను ఎంపీపీ తిరుపతమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి మనుప్రియ, సర్పంచ్‌లు నారాన్‌రెడ్డి, జంగయ్య, ఎంపీటీసీ సుదర్శన్, డాక్టర్ కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.


స్ఫూర్తి తండాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్


పెద్దతండాలో..


బోయిన్‌పల్లిలో..

స్కాలర్‌షిప్ జాబితా సిద్ధం చేయాలి


జడ్చర్లలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ జ్యోతి

జడ్చర్ల టౌన్: ఎస్సీ, ఎస్టీ విద్యార్థులతో ఈనెల 20వ తేదీలోగా స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేయించాలని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలకు జెడ్పీ సీఈఓ జ్యోతి సూచించారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. స్కాలర్‌షిప్‌లకు అవసరమైన ధ్రువపత్రాలను 20వ తేదీలోగా సిద్ధం చేయించి దరఖాస్తు స్వీకరించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంఈఓ మంజులాదేవి, ఎంపీడీఓ ఉమాదేవి పాల్గొన్నారు.

అడ్డాకుల: విద్యార్థులు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి రాధారోహిణి సూచించారు. మూసాపేట మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ అధికారులు, ఎంఈఓ, హెచ్‌ఎంలతో విద్యార్థుల ఉపకార వేతనాల దరఖాస్తుల కోసం జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సమావేశంలో ఎంపీడీఓ స్వరూప, తహసీల్దార్ మంజుల, డీటీ వరప్రసాద్, ఎంఈఓ రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

గండీడ్: స్కాలర్‌షిప్‌కు అర్హులైన విద్యార్థుల జాబితాను త్వరితగతిన సిద్ధం చేయాలని ప్రత్యేకాధికారి బాబురావు పేర్కొన్నారు. శుక్రవారం గండీడ్ మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉమ్మడి గండీడ్ మండల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, గండీడ్ మహమ్మదాబాద్ తహసీల్దార్ జ్యోతి, ఆంజనేయులు, ఎంఇఓ వెంకటయ్య పాల్గొన్నారు.

బాలానగర్: విద్యార్థులకు కులం, ఆదాయం సర్టిఫికెట్లు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు, మండల ప్రత్యేక అధికారి శ్యాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఎంఈఓ వెంకటయ్య ఆధ్వర్యంలో జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు.

అక్రమ నిర్మాణాలు నిలిపివేయండి



మహబూబ్‌నగర్ రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ఏనుగొండ శివారులో 24 సర్వేనంబర్‌లోని 5.34 ఎకరాల భూమని కొందరు ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపోగు శ్రీనివాస్ ఆరోపించారు. ఈ విషయమై శుక్రవారం అదనపు కలెక్టర్ సీతారామారావును కలిసి ఫిర్యాదు చేశారు. కొందరు భూకబ్జాదారులు అక్రమంగా, దౌర్జన్యంగా దళితుల భూమిని కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. టినెంట్ భూమిపై కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నా కూడా నిర్మాణాలను ఆపకుండా దౌర్జన్యంగా బోరు వేస్తున్నారని అన్నారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదనపు కలెక్టర్‌ను కలిసిన వారిలో యాదయ్య, గిరి, అంజి, సాయికుమార్ తదతరులు ఉన్నారు.

శ్రీశైలానికి పాదయాత్ర

కోయిల్‌కొండ: మండల కేంద్రంలో శివదీక్ష ధరించిన శివభక్తులు శుక్రవారం కాలినడకన శ్రీశైలానికి బయలుదేరి వెళ్లారు. గ్రామంలోని ఆదిఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడులు ధరించి కాలినడకన శ్రీశైలానికి బయలుదేరి వెళ్లారు.

చిన్నచింతకుంట: మండలంలోని అప్పంపల్లిలో శుక్రవారం శివస్వాములు శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరారు. మహిళలు, పెద్దలు ఊరేగింపులో పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

మహమ్మదాబాద్: విద్యార్థులు పౌష్టికాహారం తప్పకుండా తీసుకోవాలని వైద్యురాలు హబీబ్ హున్నీసాబేగం తెలిపారు. శుక్రవారం గాధిర్యాల్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. 150 మంది విద్యార్థులు ఉండగా, 110 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వివిధ సమస్యలతో బాధపడుతున్న 10మంది విద్యార్థులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ పార్వతి, ఎఎన్‌ఎం చంద్రకళ, హెచ్‌ఎం నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే సుస్థిరపాలన సాధ్యం



మాట్లాడుతున్న శాంతికుమార్

జడ్చర్ల టౌన్: ప్రపంచ దేశాలు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుంటే ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో సుస్థిర పాలన అందిస్తుందని ఆ పార్టీ రాష్ట్రకోశాధికారి శాంతికుమార్ అన్నారు. శుక్రవారం పార్టీ కార్నర్ మీటింగ్‌లో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు కుమ్మరివాడలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కరోనా నుంచి ప్రతి పౌరుడికి 5కిలోల ఉచితబియ్యం ఇస్తూ కడుపు నింపుతున్నామన్నారు. సంక్షోభానికి తావులేని పాలన దేశంలో కొనసాగుతుందన్నారు. ఈ విషయాలన్ని కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. వాటిని ఇంటింటికి చేరవేయాలన్నారు. ఉదండాపూర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆ పార్టీ నాయకురాలు బాలత్రిపురసుందరిదేవి మాట్లాడుతూ బీజేపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. నాయకులు మదుసూదన్‌యాదవ్, ప్రతాప్‌రెడ్డి, నాగరాజు, కౌన్సిలర్ కుమ్మరి రాజు పాల్గొన్నారు.

బూత్ స్థాయిలో బలోపేతం చేయాలి..

భూత్పూర్: బూత్ స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేయడానికి కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలో ప్రజా గోస-బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌లో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 6గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తుందని, ఇళ్లకు 24 గంటల విద్యుత్ కేంద్రం ప్రభుత్వం పుణ్యమేనని అన్నారు. సమావేశంలో నాయకులు సుదర్శన్‌రెడ్డి, సత్యయ్య గౌడ్, రవీందర్‌రెడ్డి, రవీందర్, బీంరాజ్ పాల్గొన్నారు.

పండిత, పీఈటీలకు ప్రమోషన్లు ఇవ్వాలి


మాట్లాడుతున్న పాపన్నగారి మాణిక్‌రెడ్డి

కోయిల్‌కొండ: ఉన్నత పాఠశాలలోని పండిత వ్యాయమ ఉపాధ్యాయుల పోస్టుల పదోన్నతి ప్రకియ పూర్తి చేసి వెంటనే పదోన్నతులు కల్పించాలని యూటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గార్లపహాడ్, కోయిల్‌కొండ, పారుపల్లి, చంద్రాస్‌పల్లి, మల్కాపూర్, సూరారం, వింజమూర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ పాఠశాలలను సందర్శించి మార్చిలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాణిక్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు వెంకటేష్, రవికుమార్, రాములు, మొగులయ్య, రామ్మోహన్ పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం



జడ్చర్ల టౌన్: పట్టణంలోని సిగ్నల్‌గడ్డపై ఎమ్మెల్యే జన్మదినం పురస్కరించుకుని పెట్టిన భారీ కటౌట్ శుక్రవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు పడిపోయింది. కటౌట్ పడిన సమయంలో పరిసరాల్లో ఎవరూ లేకపోవటంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది. అయితే కటౌట్ పక్కనే ఉన్న పండ్ల బండి, ఆటోపై పడటంతో దెబ్బతిన్నాయి. కటౌట్ పడిన వెంటనే సమాచారం అందుకున్న మున్సిపాలిటీ సిబ్బంది జేసీబీ సాయంతో తొలగించారు. కటౌట్ పడిపోయిన స్థలాన్ని కాంగ్రెస్ నాయకుడు జనంపల్లి అనిరుధ్‌రెడ్డి సందర్శించి పండ్ల బండి నిర్వాహకులను పరామర్శించారు. వారికి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకుల కటౌట్లు, ఫ్లెక్సీలు ఇష్టారాజ్యంగా పెడుతున్నారని, మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

ప్రమాదాల నివారణకు కృషి చేయాలి


కందూర్ స్టేజీ వద్ద పరిశీలిస్తున్న సీఐ రజితారెడ్డి

అడ్డాకుల: భూత్పూర్ సర్కిల్ పరిధిలోని జాతీయ రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రదేశాలను శుక్రవారం భూత్పూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రజితారెడ్డి పరిశీలించారు. మండలంలోని కందూర్ స్టేజీ, మూసాపేట మండలంలోని పోల్కంపల్లి స్టేజీ, గాజులపేట స్టేజీ వద్ద శాఖాపూర్ టోల్‌ప్లాజా అధికారులతో కలిసి బ్లాక్ స్పాట్లను పరిశీలించారు. బ్లాక్ స్పాట్ల వద్ద ఇప్పటి వరకు రహదారుల సంస్థ ద్వారా చేపట్టిన నివారణ చర్యలను తెలుసుకున్నారు. కందూర్ స్టేజీ వద్ద కందూర్ రోడ్డుపై వాహనాలు వేగంగా హైవే మీదకు వస్తున్నందున కందూర్ రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయించాలని సీఐ సూచించారు. అదేవిధంగా పోల్కంపల్లి, గాజులపేట స్టేజీల వద్ద కూడా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్‌ఐలు విజయకుమార్, భాస్కర్‌రెడ్డి, టోల్‌ప్లాజా ప్రాజెక్టు మేనేజర్ మదన్ మోహన్, సంతోష్, రాకేష్‌గౌడ్ ఉన్నారు.

పోచమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠాపన


శివాలయం నిర్మాణం కోసం భూమిపూజ చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/స్టేషన్ మహబూబ్‌నగర్: స్థానిక 35వ వార్డు పరిధిలోని న్యూమోతినగర్‌లో శుక్రవారం పోచమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠాపనకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే శ్రీవర్షగిరి ఆంజనేయస్వామి ఆలయం పక్కన శివాలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం స్థానికులతో ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలనీలోని రోడ్ల నిర్మాణం, విద్యుత్ స్తంభాలు, కొత్త వీధి దీపాల ఏర్పాటు కమ్యూనిటీ హాల్ పనులను శరవేగంగా చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన కాలనీ వాసి, బీఎస్‌ఎన్‌ఎల్ రిటైర్డ్ ఉద్యోగి కొండయ్యను ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

నవాబుపేట: మండలంలోని తిర్మలాపూర్ సమీపంలోని దుందుబీ వాగులో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున రాజాపూర్ మండలం తిర్మలాపూర్‌కు చెందిన వెంకటయ్య టిప్పర్‌లో దుందుభీ వాగులో నుంచి అక్రమంగా ఇసుకను మండలం నుంచి రంగారెడ్డి జిల్లా కొందుర్గుకు తరలిస్తుండగా, విధుల్లో ఉన్న పోలీసులు పట్టుకుని సీజ్ చేసినట్లు వివరించారు. ఎలాంటి అనుమతి లేకపోవటంతో టిప్పర్ డ్రైవర్ జాఫర్, టిప్పర్ యజమాని వెంకటయ్యపై కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

నామమాత్రంగా విచారణ

సాక్షి ఎఫెక్ట్..


భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ విఠల్‌నాయక్

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని ధర్మాపూర్‌లో ప్రభుత్వ బీసీ బాలికల వసతిగృహంలో జరుగుతున్న అవకతవకలపై 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వాస్తవాలను కప్పిపుచ్చేందుకు సంబంధిత అధికారులు ప్రయత్నం చేశారు. అందులో భాగంగానే ఇతర శాఖల అధికారులతో విచారణ చేయించి సంబంధిత వార్డెన్‌పై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు తమ శాఖలోనే ఓ అధికారితోనే విచారణ పూర్తిచేయించారు. శుక్రవారం జిల్లా అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ విఠల్‌నాయక్‌ను బీసీ బాలికల వసతిగృహాన్ని సందర్శించి వార్డెన్‌తో, విద్యార్థినులతో మాట్లాడారు. హాస్టల్ అంతా సవ్యంగా ఉన్నట్లు 'సాక్షి'కి వివరించారు. వార్డెన్‌పై వచ్చిన ఆరోపణలను తప్పుదోవ పట్టించేందుకు వర్కర్ల మధ్య విభేదాలు ఉన్నాయని, అందువల్లే కొంత సమస్య నెలకొందని విచారణ అధికారి తెలపడం శోచనీయం. కాగా, విచారణ అధికారి హాస్టల్‌కు చేరుకునే సమ యానికి అందులో అన్నీ రెడీమేడ్ సరుకులు ప్రత్యక్షమయ్యాయి.

వరిలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి


అప్పంపల్లిలో వరిపంట పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి రాజేష్‌ఖన్న

చిన్నచింతకుంట: సల్ఫేట్ లోపంతో వరిపంటలో దుష్ప్రభావం సంభవిస్తుందని మండల వ్యవసాయ అధికారి రాజేష్‌ఖన్న రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని అప్పంపల్లిలో రైతులు సాగు చేసిన వరిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేలమడి మెత్తగా ఉండే బురద నేలలో సల్ఫేట్ లోపం ఏర్పడుతుందన్నారు. మొక్క వేర్లకు గాలి తగిలే విధంగా పొలంలో సన్నని నెర్రలు వచ్చే వరకు ఆరబెట్టి నీటిని పెడుతూ ఉండాలన్నారు. కలుపు తీసిన తరువాత ఒక ఎకరానికి 25-30 కేజీల యూరియా, 25శాతం కార్బండిజం, 50శాతం మాంకోజెబ్ పొడి మందును కలిపి బురద పదునులో చల్లాలని తెలిపారు. జింక్‌లోపం ఉన్నట్లయితే 2గ్రాముల జింక్ సల్ఫేట్‌ను లీటర్‌నీటిలో కలిపి ఐదురోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని తెలిపారు. అధికారుల సూచనలతో పంట సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించుకోవాలన్నారు.

హమారా ప్రసాద్‌ను వెంటనే శిక్షించాలి


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్ దిష్టిబొమ్మను శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాతపాలమూరు జై భీమ్ చౌరస్తాలో బహుజన మహనీయుల శోభయాత్ర కమిటీ, దళిత సంఘాల ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రసాద్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పీడీ యాక్ట్‌తో పాటు దేశ ద్రోహం కేసు పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శోభయాత్ర కన్వీనర్ రమేష్, కోఆర్డినేటర్ సింగిరెడ్డి పరమేశ్వర్, నాయకులు దేవన్న, యాదయ్య, శేఖర్, అల్లీపురం శేఖర్, బీసీ నాయకులు ప్రభుశీను, సాంబ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి..

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హర్షప్రసాద్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని మాలల చైతన్య సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మూలె కేశవులు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌పై వీడియో ద్వారా అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానపరిచి ప్రచారం చేసిన హర్షప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.

రామలింగేశ్వర స్వామి కల్యాణం

బాలానగర్: మండలంలోని మోతీఘణాపూర్‌లో శుక్రవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. వేద పండితుల సమక్షంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం అనంతరం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం వందల మంది భక్తుల మధ్య ఘనంగా నిర్వహించారు.

శివాలయంలో పూజలు



నవాబుపేట: మండల కేంద్రంలోని శివాలయంలో రెండు రోజుల పాటు జరిగిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమ పూజలు శుక్రవారంతో ముగిశాయి. పూర్ణాహుతి ఇచ్చి విగ్రహస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్‌గౌడ్, సుధకర్‌చారీ, చంద్రశేఖర్, యాదయ్య, నాగేష్, బాలాజీ, రాజు, నర్సింహాగౌడ్, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ బోనాలు

గండీడ్: పోలేపల్లి ఎల్లమ్మ జాతర ఉత్సవాలను పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో ఎల్లమ్మ బోనాల ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వెన్నాచేడ్, రుసుంపల్లి, చిన్నవార్వాల్, జిన్నారం, పెద్దవార్వాల్ తదితర గ్రామాల్లో భక్తులు ఎల్లమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. కోళ్లు, మేకలను బలి ఇచ్చారు.

నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి




మహమ్మదాబాద్: నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఎంపీఓ శంకర్‌నాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కంచన్‌పల్లి నర్సరీ, పల్లెప్రకృతి వనాన్ని పరిశీలించారు. అనంతరం మొక్కలకు నీళ్లు పట్టారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు చనిపోకుండా ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యదర్శులు ఎప్పటికప్పుడు పనులు పర్యవేక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుభద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ఆభరణాల ఊరేగింపు



భూత్పూర్: పట్టణంలోని మునిరంగస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం స్వామి అలంకరణం చేసే అభరణాలను పట్టణంలోని వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి ఆలయానికి తీసుకెళ్లారు. మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్ ఆభరణాలకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గడ్డం నాగమ్మ, యాదయ్య, సింగిల్ విండో డైరెక్టర్ గడ్డం రాములు, ఆలయ కమిటీ సభ్యులు నర్సింహులు, ప్రేమ్‌కుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

స్వయం పరిపాలన దినోత్సవం


భూత్పూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

భూత్పూర్: మున్సిపాలిటీలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కలెక్టర్‌గా దేవదాస్, డిప్యూటీ డీఈఓగా భానునాయక్, డీఈఓగా కృష్ణమోహన్, ఎంఈఓగా భానుప్రకాష్, ఉపాధ్యాయులుగా పలువురు విద్యార్థులు వ్యవహరించారు. ఠాగూర్ మెమోరియల్ పాఠశాలలో కరస్పాండెంట్‌గా రెడ్డికుంట విజయ, ప్రిన్సిపాల్‌గా శ్రావిక, డీఈఓగా శ్రీవాణి, ఎంఈఓగా అయేషా సిద్దిక్, పీఈటీగా సంజీవ తదితరులు వ్యవహరించారు.

మిడ్జిల్: మండలంలోని కొత్తపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్‌ఎంగా అమూల్య, ఎంఈఓగా మహేష్ వ్యవహరించారు.


కొత్తపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో..